సాక్షి చిత్తూరు

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలి

జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిఘా పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



'అయ్యో'ర్ల జాబితా

టీచర్ల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో తలమునకలయ్యారు. - 8లో



పీవీకేఎన్ కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్

జిల్లాలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో

న్యూస్‌రీల్

రేపు జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం



పాత సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్ : జెడ్పీ కార్యాలయంలో శనివారం జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు గురువారం సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. వినియోగంలో లేని జెడ్పీ పాత సమావేశ మందిరాన్ని బాగు చేసి అక్కడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందుకు సంబంధించి పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలను చేశారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం ఉంటుందన్నారు. స్థాయి సంఘాలు, చిన్న చిన్న సమావేశాలకు పాత సమావేశ మందిరాన్ని వినియోగించుకుంటామన్నారు. సర్వసభ్య, ఇతర పెద్ద సమావేశాలకు నూతన మందిరాన్ని వాడుకోవచ్చన్నారు. అందులో భాగంగా సిబ్బందికి పలు ఆదేశాలను ఇచ్చామని తెలిపారు.నేల, సీట్లు, గోడలు మొత్తం శుభ్రం చేయాలన్నారు. అలాగే లైటింగ్, స్పీకర్లు మరమ్మతు పనులు , నీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో టైల్స్ వేయాలన్నారు. ఇక జెడ్పీ సమావేశ మందిరాన్ని ఇతర శాఖలకు నామమాత్రపు అద్దెతో ఇవ్వనున్నామని చెప్పారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బంగారుపాళెం : బాల్యవివాహాలు చేస్తే అనర్థాలు తప్పవని తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఓ గ్రామంలో బాల్యవివాహం చేస్తున్నారనే ఫిర్యాదుపై అధికారులు స్పందించి అడ్డుకున్నారు. బంగారుపాళెం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి పలమనేరు మండలానికి చెందిన ఓ బాలికతో వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న పలమనేరు సీడీపీఓ ద్రాక్షాయణి, బంగారుపాళెం సీడీపీఓ వాణిశ్రీదేవి, సీఐ శ్రీనివాసులు, సిబ్బంది ఆ గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం తహశీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ ఎదుట హాజరు పరచగా ఇరువురి కుటుంబ సభ్యులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వారికి వివరించారు.

కాణిపాకంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి



హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తికి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని గురువారం రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికిన ఆలయ అధికారులు దగ్గరుండి దర్శన సేవలు చేయించారు. ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి, కోర్టు సిబ్బంది ఉన్నారు.

వరసిద్ధుని సేవలో 20 సూత్రాల కమిటీ చైర్మన్



కాణిపాకం వినాయక స్వామిని గురువారం రాష్ట్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. ఆర్డీఓ శ్రీనివాసులు ఉన్నారు.



పుంగనూరు : వాన కురిస్తే బైరేబండ క్రాస్‌లో గుంతల రహదారి ఇలా..

పెద్దిరెడ్డిపై కక్ష.. రోడ్లపై వివక్ష

మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై కక్షతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ పాలనలో మంజూరు చేసిన రూ.56 కోట్ల రోడ్డు పనులను రద్దు చేయడం విస్మయానికి గురిచేస్తోంది. గుంతలమయంగా మారిన రోడ్లలో ప్రయాణాలు సాగించలేక నరక యాతన పడుతుంటే ప్రజల బాధ చూడలేక పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాటికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆ మేరకు 4. కి.మీ మేర కల్వర్టు పనులు కూడా వేగంగా చేపట్టారు. ఈ క్రమంలో ఎన్నికలతో పనులు ఆగిపోయాయి. అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో పనులు వేగంగా సాగుతాయని ప్రజలు ఆశించారు. కానీ మాజీ మంత్రిపై బాబు కక్షతో ప్రజలు ఎన్ని కష్టాలు పడినా తనకేమనే విధంగా కుంటిసాకులతో రోడ్ల పనులను రద్దు చేయడంతో పుంగనూరులో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

- రూ.56.93 కోట్ల పనులు రద్దు
- రూ.49 కోట్ల టెండర్లు రద్దు
- ఆర్‌అండ్‌బీ శాఖ ఆదేశం
- ఇక గుంతల రోడ్లే శరణ్యం
- పుంగనూరు రోడ్లకు చంద్ర గ్రహణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

పుంగనూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుంగనూరు నియోజకవర్గంలో రహదారులు అభివృద్ధి చేయాలని మంజూరు చేసిన పనులను తెలుగుదేశం ప్రభుత్వం కక్ష కట్టి రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారుల్లో పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికలు రావడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఆ పనులు 25 శాతం మించి జరగలేదని, మరికొన్ని పనులు ప్రారంభించలేదనే కుంటి సాకుతో రూ.56.93 కోట్ల పనులను, రూ.49 కోట్ల టెండర్‌ను రద్దు చేస్తూ రహదారుల శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్‌దండే ఉత్తర్వులు జారీ చేశారు.

రద్దు చేసిన పనుల వివరాలు

పుంగమ్మ చెరువు కట్టపై నుంచి ఉన్న శంకర్రాయలపేట రోడ్డు వయా బైరెడ్డిపల్లి, బెంగళూరుకు ప్రధాన రహదారి కావడంతో సుమారు 4 కిలోమీటర్ల రోడ్డులో సుమారు 300 గుంతలు ఉండటంతో ప్రయాణాల రాకపోకలు నరకంగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్ల విస్తరణ, మరమ్మతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నివేదికలు పంపారు. ఈ మేరకు అప్పటి ప్రభుత్వం పనులు చేపట్టాలని, ఇందుకు అవసరమైన రూ.7.87 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. పనులను కాంట్రాక్టర్ చకచకా చేపట్టారు. 4 కిలో మీటర్లలో ఉన్న రోడ్డు కల్వర్టులను నిర్మించారు. పుంగమ్మ చెరువు కట్టను విస్తరించి బలోపేతం చేసేందుకు సైడ్ వాల్స్ నిర్మించారు. ఇలా ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ఆపివేయాల్సి వచ్చింది. అలాగే చౌడేపల్లె మండలం కల్లుపల్లి - చౌడేపల్లె రోడ్డు 8 కిలో మీటర్లు రూ.12.49 కోట్లు , రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల - ఎర్రావారిపాళెం 14 కిలో మీటర్ల రోడ్డు రూ.20.59 కోట్లు, సోమల మండలం సోమల-పెద్ద ఉప్పరపల్లె రోడ్డు వయా నంజంపేట 5 కిలో మీటర్లకు రూ.11.42 కోట్లతో పాటు టెండర్ల స్టేజ్‌లో ఉన్న సదుం మండలం చెరుకువారిపల్లె - మతుకువారిపల్లె రోడ్డు 4 కిలో మీటర్లకు రూ.9 కోట్లు. చెరుకువారిపల్లె-నంజంపేట రోడ్డుకు 17 కిలో మీటర్లకు రూ.40 కోట్లు మంజూరు చేసింది. అనేక పనులు ప్రారంభించి మధ్యలో ఆగిపోయాయి. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం మారి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పుంగనూరుపై కక్ష కట్టింది. ఎంతో అవసరమైన ప్రధాన రహదారుల పనులను నిలిపివేసి , అనుమతులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా బెంగళూరు రోడ్డు

పట్టణం నుంచి శంకర్రాయలపేట-బెంగళూరు రహదారి అధ్వానంగా ఉంది. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. పుంగమ్మ చెరువు కట్టపై గల రోడ్డు దారుణంగా మారింది. అలాగే యాబైరెల్ల మొరవ వద్ద పెద్ద గుంతలు పడ్డాయి. డాన్‌బోస్కో స్కూల్ , అరవపల్లి వద్ద, ఇటుకల బట్టీల వద్ద, ఆంజనేయస్వామి గుడి సమీపం , బైరేబండ సమీపం, కంపోస్ట్ యార్డు సమీపంలో లెక్కలేనన్ని గుంతలు పడ్డాయి. ఈ రహదారిలో కార్లు, ద్విచక్రవాహనాలు, బస్సులు ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు.







పుంగనూరు : వర్షం పడితే అరవపల్లి వద్ద రోడ్డు దుస్థితి, పుంగనూరు- శంకర్రాయలపేట రోడ్డులో కత్తార్లపల్లె క్రాస్ వద్ద పెద్ద గుంతలు, పుంగమ్మ చెరువు కట్టను విస్తరిస్తున్న దృశ్యం

సర్వం సిద్ధం.. దక్షిణ కైలాసం



ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపకాంతులు



ఆర్చికి విద్యుత్ దీపాలంకరణ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి క్షేత్రం సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి 14 రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం ముక్కంటికి ప్రియభక్తుడైన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. శ్రీకాళహస్తి పట్టణం విద్యుత్ దీపకాంతులతో విరాజిల్లుతోంది. స్వర్ణముఖి నది వంతెనపై నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం రాత్రి శోభాయమానంగా దర్శనమిచ్చింది.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,745 మంది స్వామివారిని దర్శించుకోగా 24,156 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

వేదన..రోదన

సొంతంగా ఏ పని చేసుకోలేని వారు.. కొందరు పుట్టుకతో.. ఇంకొందరు అనారోగ్యం కారణంగా వైకల్యం బారిన పడినవారు. వీరంతా నిరుపేదలు.. ప్రభుత్వ సాయంతోనే నాలుగు ముద్దలు నోటికాడికి వెళుతున్న దివ్యాంగులు వీరు .. గత ప్రభుత్వాన్ని బూచిగా చూపి పింఛన్లలో కోత పెట్టాలని కూటమి నిర్ణయించింది. కానీ పునఃపరిశీలన పేరుతో సదరం కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో దివ్యాంగుల అగచాట్లు చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది.. కానీ అధికారులు.. కూటమి ప్రభుత్వ పెద్దలు వీరిపై కనికరం చూపకుండా దివ్యాంగులను కన్నీళ్లు పెట్టిస్తున్న తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

- సదరంలో దివ్యాంగుల అగచాట్లు
- కుటుంబ సభ్యుల అపసోపాలు
- అర్హత ఉన్నా తప్పని పునఃపరిశీలన
- అందుబాటులో లేని వీల్‌చైర్లు, స్ట్రెచర్లు
- కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కరువు
- ఓపీ నుంచి పరీక్ష వరకు పడరానిపాట్లు

జిల్లాలోని పింఛన్ల సమాచారం	
దివ్యాంగ	35,277
అంగవైకల్యం	19,927
అంధత్వం	3,093
వినికిడి లోపం	5,332
మానసిక వికలత్వం	5,283
బహుళ వైకల్యం	1,642





నాన్నకు తోడుగా... బాలుడు, కష్టం మీద ఆస్పత్రికి చేరుకున్న ఓ వృద్ధురాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కూటమి ప్రభుత్వం చేపట్టిన సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన ప్రక్రియ దివ్యాంగులకు పిడుగుపాటుగా మారింది. సదరం క్యాంపులకు చేరుకునేందుకు దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఏళ్ల తరబడి మంచం పట్టిన వారిని ఆస్పత్రులకు తీసుకొచ్చేందుకు.. కుటుంబ సభ్యులు అష్టకష్టాలు పడుతున్నారు. లేవలేని స్థితిలో కొందరు.. ఎక్కడికి వచ్చామో తెలియని అయోమయ పరిస్థితిలో మరికొందరు.. గంటల తరబడి నిరీక్షించలేక నీరసించి సొమ్మసిల్లి పడిపోయిన వారు కొందరు.. ఊతకర్ర సాయంతో చేరుకున్న వారు ఇంకొందరితో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వేదికగా మారింది.

కనీస సౌకర్యాలు కల్పించక

సదరం క్యాంపునకు వచ్చే వారికి కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారుల తీరు ఏ మాత్రం మారడం లేదు. ఫలితంగా దివ్యాంగులకు చక్రాల కుర్చీలు దొరకడం గగనమవుతోంది. వీటిని కొంత మంది సిబ్బంది గదుల్లో ఉంచి అవసరమైన సమయాల్లో ఇతర పనులకు వినియోగిస్తున్నారు. సదరం క్యాంపులో రీ వెరిఫికేషన్ నిమిత్తం వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇవి ఎక్కడున్నాయో ఎవరికీ తెలియడంలేదు. సదరం పరిశీలనకు వచ్చే వారితో ఓపీ విభాగం నిండిపోతోంది. భారీ సంఖ్యలో ఓపీకి రావడంతో ఆ విభాగంలో బాధితులు బారులు తీరుతున్నారు. ఇద్దరు మాత్రమే ఓపీ సేవల్లో పాలు పంచుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

ప్రభుత్వం తీరుపై మండిపాటు...

అధికారంలోకి వస్తే అందరికీ మంచి చేస్తాం. సంక్షేమ పథకాలు అందిస్తాం.. స్వర్ణయుగం లాంటి పాలన అందిస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో నమ్మబలికారు. తీరా చూస్తే... అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సంక్షేమ పథకాలు అటకెక్కించిన సంగతి పక్కనపెడితే... దివ్యాంగత్వం పునః పరిశీలన పేరుతో దివ్యాంగులను అష్ట కష్టాలకు గురిచేయడం అందరినీ ఆవేదనకు గురిచేస్తోంది. ఆస్పత్రుల వద్ద నిరీక్షిస్తున్న దివ్యాంగులను చూసిన వారు అయ్యో అంటూ నిట్టూర్చారు. అవయవ లోపాలతో ఇబ్బందులు పడుతున్న వారిని మళ్లీ గుర్తుచేసి వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్న తీరును పలువురు తప్పుబట్టారు.

బోగస్‌పై తప్పుడు ప్రచారం

బోగస్ పింఛన్ల మంజూరుపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని బూచిగా చూపిస్తోంది. ఇది పూర్తి అవాస్తమని వైద్యులు, పలువురు దివ్యాంగులు తిప్పికొడుతున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయం నుంచి జిల్లాలో సదరంలో అవకతవకలు చోటు చేసుకున్నాయి. ఏ సమస్యలు లేకపోయినా సమస్యలు ఉన్నట్లు సదరం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ బోగస్ వ్యవహారం పుంజుకుంది. పింఛన్ నగదు పెరగడంతో సందరానికి ఎక్కడలేని డిమాండ్ పెరిగింది. 2014 తర్వాత వేల సంఖ్యలో సదరం సర్టిఫికెట్లు పుట్టుకొచ్చాయి. కొంత మంది డాక్టర్లు రూ.10 వేల నుంచి రూ. 15 వేలు తీసుకుని ఎలాంటి సమస్యలు లేని వారికి సదరం సర్దేశారు. దీంతో సదరం పింఛన్ల సంఖ్య జిల్లాలో భారీగా పెరిగింది. అంతే తప్ప ఈ వ్యవహారాన్ని కూటమి గత ప్రభుత్వంపై బురదచల్లాలని ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా పింఛన్ల కోతకు పదును పెడుతోంది. 60 నుంచి 70 శాతం వరకు పింఛన్లలో కోతలు పెట్టాలని ఆదేశాలున్నట్లు కొంత మంది అధికారులు చెబుతున్నారు.

నాలుగు విభాగాలు ఏర్పాటు..

దివ్యాంగ పింఛన్‌దారులను రీ వెరిఫికేషన్ సెంటర్లకు రప్పిస్తోంది. గత నెల ప్రారంభమైన ప్రక్రియ జూన్ వరకు కొనసాగనుంది. జిల్లాలోని 4 ఏరియా, 8 సీహెచ్‌సీ ఆస్పత్రులు.. చిత్తూరు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంధత్వం, చెవిటి, మూగ, ఎముకల సంబంధిత, మానసిక దివ్యాంగుల దివ్యాంగత్వాన్ని పునఃపరిశీలనకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఒక్కో విభాగానికి 50 మంది నుంచి 60 మంది వరకు దివ్యాంగులు వస్తున్నారు.

నడవలేక..నానా అగచాట్లు

వీల్‌చైర్‌లు, స్ట్రెచర్ల కోసం గంటల తరబడి వెతికినా దొరకడం లేదు. అక్కడక్కడా దయదలిచి సిబ్బంది కొంత మందికి మాత్రమే ఏర్పాటు చేయగలగుతున్నారు. మిగిలిన వారి బాధలు అంతులేనివి. మరోవైపు పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ఏ మాత్రం ఉపయోగ పడటం లేదు. వీరి కళ్ల ముందే నడవలేక దివ్యాంగులు అగచాట్లు పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇక వీల్‌చైర్‌లను వివిధ అవసరాలకు .. పుస్తకాలు, రోగుల బెడ్ షీట్లు, మందులకు సంబంధించిన మెటీరియల్‌ను ఉంచి నెట్టుకుంటూ వస్తున్నారు. ఇలా ఇతర పనులకు వీల్‌చైర్‌లు దర్జాగా వినియోగిస్తున్నారు.

రవాణా సదుపాయం కల్పించక..



ఎవరూ లేక అందరూ కలిసి నడుస్తూ ..

ఇంటిలో మంచంపైనే ఉన్న ఎంతో మంది దివ్యాంగులు పునఃపరిశీలన కోసం ఆస్పత్రులకు వచ్చేందుకు నరకం చూశారు. వారి కోసం కనీసం రవాణా సదుపాయాలు కల్పించకపోవడంతో వ్యయప్రయాసల కోర్చి ఆస్పత్రులకు చేరుకున్నారు. 15 నుంచి 20 ఏళ్లుగా పింఛన్ అందుకున్నప్పటికీ మళ్లీ పునఃపరిశీలన దేనికో అని కొందరు ప్రశ్నిస్తున్నారు. కదల్లేని, లేవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, మానసిక దివ్యాంగులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావడానికి వారి బంధువులు అవస్థలు పడ్డారు. ఇక్కడికి రాకపోతే పింఛన్ తొలగిస్తారని మంచంపై ఉన్న వారిని సైతం ఆస్పత్రికి అతి కష్టం మీద తెచ్చామని పలువురు వాపోయారు.

పింఛన్లు కుదించాలని..

జిల్లా వ్యాప్తంగా 2,55,818 మంది సామాజిక పింఛన్‌దారులున్నారు. ఇందులో 35,277 మందికి సదరం గుర్తింపు కార్డులు ఉన్నాయి. వీరికి పునఃపరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం పింఛన్లల్లో కోతలు పెట్టేందుకు పూనుకుంది. గత ప్రభుత్వంలో బోగస్ జరిగిపోయిందని కూటమి తప్పుడు ప్రచారం చేయించి పింఛన్ల తొలగింపునకు సిద్ధమైంది. వీలైనంత వరకు పింఛన్ల సంఖ్యను కుదించాలని కుస్తీ పడుతోంది. అందుకే డాక్టర్లను సైతం మార్పు లు చేసి ఈ పరిశీలనకు ప్రాధాన్యం ఇచ్చింది.

వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల కమిటీ నియామకం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల కమిటీల్లో పలువురిని వివిధ హోదాల్లో నియమించినట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆమేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉపాధ్యక్షుడిగా శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గాది మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.వాసుదేవనాయుడు, సంస్థాగత కార్యదర్శిగా ఎస్.మహదేవ్‌రెడ్డి, కార్యదర్శులుగా సి.వరప్రసాద్‌నాయుడు, బాలిశెట్టి విజయ్‌శేఖర్ నియమితులయ్యారు.

రాష్ట్ర అనుబంధ కమిటీలో జిల్లా వాసులు

చిత్తూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ కమిటీకి సంబంధించి చిత్తూరు జిల్లాలోని పలువురికి చోటు కల్పిస్తూ గురువారం కేంద్రపార్టీ కార్యాలయం తెలిపింది. రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శిగా లీనారెడ్డి, రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, రైతు విభాగం అఫిషియల్ స్పోక్ పర్సన్ ప్రవీణ్‌రెడ్డి, రైతు విభాగ సంయుక్త కార్యదర్శులుగా చంద్రశేఖర్‌రాజు, సుధాకర్‌నాయుడు, శ్రీరాములురెడ్డి, పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శులుగా దిలీప్‌రెడ్డి, జనార్దన్, నగేష్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డిని నియమించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- మోటార్ సైకిళ్లు ఢీకొని ఒకరు
- ఆర్టీసీ బస్సు ఢీ కొని మరొకరు
- ఒకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన సుధాకర్ (ఫైల్)

వడమాలపేట (విజయపురం): మోటార్ సైకిళ్లు ఢీకొని ఒకరు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం రాత్రి వడమాలపేట మండలం కదిరిమంగళం క్రాస్ వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ ధర్మారెడ్డి కథనం.. ఎస్వీ పురానికి చెందిన మేస్త్రీ పనిచేసే సుధాకర్ (52 తిరుపతిలో పని ముగించుకొని ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వస్తూ మృత్యువాత పడ్డాడు. తమిళనాడుకు చెందిన హర్ష (25) చెన్నై నుంచి ద్విచక్రవాహనంపై తిరుపతికి వస్తూ పరస్పరం కదిరిమంగళం క్రాస్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హర్షను తిరుపతికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరంగరాజపురం మండలంలో..

శ్రీరంగరాజపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన 49 కొత్తపల్లి మిట్ట సమీపంలోని సీఎస్‌ఐ చర్చి వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం...మండలంలోని కటికపల్లెకు చెందిన తిరుమలేశం(42) తన సొంత పనుల నిమిత్తం బైక్‌లో బంగారుపాళ్యం వెళ్లి తిరుగు ప్రయాణంలో 49 కొత్తపల్లిమిట్ట సమీపంలోని సీఎస్‌ఐ చర్చి వద్ద తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు చోరీ

పుంగనూరు : చిన్నతాండలో ఇంటి వద్ద పెట్టిన కారును దొంగలు చోరీ చేసిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బెరుకలానాయక్ తనకు తెలిసిన షబినా అనే మహిళకు చెందిన కారును రాత్రి తన ఇంటి ఆవరణలో పెట్టి నిద్రించాడు. గురువారం ఉదయం లేచి చూసే సరికి కారు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. కారు టోల్‌గేట్ దాటి వెళ్లడాన్ని గుర్తించి అప్రమత్తం చేశారు.

పోలీసుల వెనుకడుగు

> '70 సెంట్ల భూమికి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు నా సంతకాన్నే ఫోర్జరీ చేశారు. ప్రభుత్వ సీల్ మా కార్యాలయానిది కాదు. ఎక్కడో బయట తయారు చేయించినట్లు ఉన్నారు. నిందితులు ఎవరో తేల్చి, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోండి.'
>
> – చిత్తూరు తహసీల్దార్ ఫిర్యాదు

> 'పెండింగ్ కేసులు ఎందుకు దర్యాప్తు పూర్తి చేయడం లేదు..? ఎఫ్‌ఐఆర్ చేసిన తరువాత ఇన్వెస్టిగేషన్ చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలి కదా..! చార్జిషీట్ కోర్టుకు పంపాలి కదా..? ప్రతి సమీక్షలోనే ఈ విషయంపై సీరియస్‌గా తీసుకొమ్మంటే కొందరు నిర్లక్ష్యంగా ఉన్నారు. పద్ధతి మార్చుకోకుంటే నేను సీరియస్ కావాల్సి ఉంటుంది.'
>
> – క్రైమ్ మీటింగ్‌లో చిత్తూరు ఎస్పీ

- కదలని తహసీల్దార్ సంతకాల ఫోర్జరీ కేసు
- చిత్తూరులో 70 సెంట్లు.. జీడీ నెల్లూరులో ఓ స్థలం
- తహసీల్దార్ ఫిర్యాదు చేసినా సాగని దర్యాప్తు
- నిందితుల్లో వీఆర్‌ఏ.. ప్రైవేటు ఉద్యోగులు
- పోలీసు అధికారులపై ఎస్పీ ఆగ్రహం?

చిత్తూరు అర్బన్ : సాక్షాత్తు మండల మెజిస్ట్రేజ్ తన సంతకం ఫోర్జరీ చేశారు.. ఎవరు చేశారో నిగ్గు తేల్చండని రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పోలీసులు మాత్రం దర్యాప్తు చేయకుండా మొండికేస్తున్నారు. మరో కేసులో సర్వేయర్ సంతకం ఫోర్జరీ చేశారని బాధితుడు ఫిర్యాదు చేసినా .. పోలీసులు అదే మౌనం పాటిస్తూ ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఫోర్జరీ సంతకాలతో రూ.లక్షలు విలువ చేసే భూములు కొట్టేశారని మొత్తుకుంటున్నా ఖాకీలకు వినపడడం లేదు. వీరి వెనుక కూటమి నేతల ఒత్తిళ్లతోనే కేసు నీరుగారుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

తహసీల్దార్ అంటే మండలానికే మేజిస్ట్రేట్. తన సంతకం ఫోర్జరీ చేశారంటూ స్వయంగా తహసీల్దార్ రాత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే.. ఇప్పటి వరకు కేసు అతీగతి లేదు. రూ.లక్షలు విలువ చేసే 70 సెంట్ల భూమిని కాజేయడంలో తన సంతకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఫోర్జరీ చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మౌనం వహిస్తున్నారు. చిత్తూరులో గతేడాది డిసెంబరు నెలలో వెలుగు చూసిన ఈ ఘటనపై స్థానికంగా కలకలం రేగింది. కొందరు ఇంటి దొంగల ప్రమేయంతోనే తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై తాలూక పోలీసులు కేసు నమోదు చేసి నెల కావస్తోంది. కానీ పురోగతి మాత్రం కనిపించడంలేదు.





ఫోర్జరీ చేసిన చిత్తూరు తహసీల్దార్ సంతకం, గంగాధర నెల్లూరులో సర్వేయర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన నిందితులు

గ్రామకంఠ భూమి రిజిస్ట్రేషన్

గంగాధర నెల్లూరులో ఓ ఇంటి స్థలానికి సర్వేయర్ గ్రామకంఠ భూమిగా సర్టిఫికెట్ ఇచ్చినట్లు ఏకంగా రిజిస్ట్రేషన్ చేసేశారు. దీనిపై మహదేవ మంగళంకు చెందిన పట్టాభి అనే బాధితుడు గంగాధర నెల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సర్వేయర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారంటూ, స్థానిక టీడీపీ నేత నటరాజ మొదలియార్‌తో పాటు ఆరుగురు ఈ కుట్రకు పాల్పడ్డారంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్‌ఐఆర్ నమోదయింది. నిందితులు ఎవరో తెలుసు, ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో కూడా తెలుసు. కానీ దర్యాప్తు మాత్రం ముందుకు కదలడం లేదు.

నేతల అండదండలు

చిత్తూరులో జరిగిన ఘటనలో ఇద్దరు వీఆర్‌ఏల హస్తం ఉందని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నుంచి పోలీసుల అందరికీ తెలుసు. ఇక ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న మహిళ, మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగి మూడు నెలలు కావస్తున్నా ఈ కేసులో ఎలాంటి పురోగతి లేదు.

ఇది నిందితులను తప్పించడంతో పాటు, కేసు నీరుగారే ప్రమాదం ఉంది. గంగాధర నెల్లూరు కేసులో తనకు అనుమానం ఉన్న నిందితుల పేర్లను స్వయాన బాధితుడే ఫిర్యాదులో పేర్కొన్నా.. చర్యలు శూన్యం. దీనికి రాజకీయ కారణాలే కనిపిస్తున్నాయి. ప్రధాన నిందితుడు టీడీపీ తరపున జెడ్పీటీసీ, సర్పంచ్‌గా పోటీ చేయడం, స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో పోలీసులు వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

వేగవంతం చేయాలని ఆదేశం

పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని ఎస్పీ పదే పదే చెబుతున్నా కొందరు పోలీసు అధికారులకు ఈ మాటలు చెవికి ఎక్కడంలేదు. తహసీల్దార్ లాంటి వ్యక్తులే ఫిర్యాదు చేసిన కేసుల్లో ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్న స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు.. సామాన్యులు స్టేషన్ మెట్లు ఎక్కితే ఎలా స్పందిస్తారో ఈ రెండు ఘటనలే ప్రత్యక్ష సాక్ష్యం.

దీనిపై చిత్తూరు ఎస్పీ మణికంఠ ఇప్పటికే సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. సంబంధిత అధికారులకు చివాట్లు పెట్టి, దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. తాలూక స్టేషన్‌లో ఓ ఎస్‌ఐ పనితీరుపై ఆరోపణలు రావడంతో ఆయన్ను వేకెంట్ రిజర్వుకు పంపించారు. కొత్త ఎస్‌ఐ ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు. మరి నెల రోజుల కాలంలో ఎస్‌ఐ దర్యాప్తుపై దృష్టి సారించకుంటే సీఐ ఏం చేస్తున్నారనే..? ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దర్యాప్తు వేగం చేసి, నిందితులకు చట్టపరంగా శిక్షలు పడేలా చేయాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉంది.

కన్నబిడ్డ కోసం తల్లి దీక్ష



పుంగనూరులో బిడ్డ కోసం నిరాహార దీక్ష చేస్తున్న తల్లి ఉషశ్రీ

పుంగనూరు : ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త .. కుమారైను చెప్పకుండా ఇంటినుంచి తీసికెళ్లి ఇద్దరూ ఎక్కడున్నారో తెలియకపోవడంతో భార్య ఆందోళన చెందుతూ మరో కుమారైతో కలసి నిరాహార దీక్ష చేపట్టిన సంఘటన గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన ప్రభు, ఉషశ్రీ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారైలు ఉన్నారు. ఇలా ఉండగా చెడు అలవాట్లకు బానిసైన ప్రభు, ఉషశ్రీని వేధించడం చేసేవాడు. ఈ క్రమంలో భర్త వేధింపులు తాళలేక ఉషశ్రీ బిడ్డలను తీసుకుని నాయుడుపేటకు వెళ్లిపోయింది. ఆ సమయంలో భర్త ప్రభు భార్య ఇంటికి వెళ్లి పెద్ద కుమారైకు సైకిల్ తీసి ఇస్తానని మాయమాటలు చెప్పి తీసికెళ్లి ఇంటికి వెళ్లకుండా వెళ్లిపోవడంతో పాప, భర్త ఆచూకీ కోసం ఉషశ్రీ ఎంత గాలించిన ఫలితం లేకపోయింది. భర్త , కుటుంబ సభ్యులు పుంగనూరులో ప్రభును దాచిపెట్టారని నిరసిస్తూ దీక్షకు దిగింది. తన బిడ్డ ఆచూకీని కనుగొనాలని, భర్తపై చర్యలు తీసుకోవాలని కోరుతోంది. దళిత సంఘాలు ఆమెకు మద్దతు పలికాయి. ఈ మేరకు తహసీల్దార్, పోలీసులకు వినతిపత్రం సమర్పించింది. సీఐ శ్రీనివాసులు చర్యలు తీసుకుంటామని బాధితురాలికి హామీ ఇచ్చారు.

మినిట్స్ వ్యవహారంపై చైర్మన్ ఆగ్రహం

- కలెక్టరేట్‌లో 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ ..చిత్రంలో కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమైన సమావేశాలు నిర్వహించేటప్పుడు చాలా అంశాలపై సమీక్ష నిర్వహిస్తారని అలాంటి వివరాలను మినిట్స్‌లో రాయకపోతే ఎలా అని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో ముఖ్యమైన శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మినిట్స్ రాయడంలో అలసత్వం వహించిన సీపీఓ కార్యాలయ సిబ్బందిపై చైర్మన్ మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ జోక్యం చేసుకుని మినిట్స్ తప్పులు లేకుండా కరెక్టుగా రాయాలని సర్దిచెప్పారు. ప్రతి శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ.. జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో విజన్–2047, స్వర్ణకుప్పం 2029 కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రతి నియోజకవర్గానికి ఏటా ప్రత్యేక బడ్జెట్‌లో రూ.కోటి మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలో మ్యాంగో బోర్డు, సెరికల్చర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, చిత్తూరు, కుప్పంలో కేంద్రియ విద్యాలయం, డిజిటల్ సైన్స్ సెంటర్, జిల్లాలో పర్యాటకరంగం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. అడవిపల్లి రిజర్వాయర్ పనులు 82 శాతం పూర్తయ్యాయని ఇందుకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్, మేయర్ అముద, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, సీపీఓ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టెంపో

వి.కోట : పట్టణంలోని బాలికల వసతి గృహం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఓ టెంపో గురువారం అర్ధరాత్రి ఢీకొంది. దీంతో పట్టణంలో గురువారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడి పట్టణం అంతా అంధకారం నెలకొంది. టెంపో డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా వెళుతూ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఆ తీవ్రతకు స్తంభం విరిగి శాంతిపురం నుంచి వి.కోట సబ్ స్టేషన్‌కు సరఫరా అయ్యే లైన్ తెగిపోయింది. శుక్రవారం ఉదయం ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ స్తంభాన్ని మార్చి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

గాయపడిన చిన్నారి మృతి



చిన్నారి రక్ష (ఫైల్)

వి.కోట : మండలంలోని గాండ్లపల్లికి చెందిన దుర్గాప్రసాద్ కుమార్తె రక్ష (08) ఈనెల 16వ తేదీ ఇంటి వద్ద వెలిగించిన దీపం ప్రమాదవశాత్తు చిన్నారి గౌనుకు మంటలు అంటుకొని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఆ చిన్నారి శరీరం 60 శాతం కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

500 కిలోల శ్రీగంధం స్వాధీనం?

– ముగ్గురు నిందితుల అరెస్టు

పుంగనూరు : వివిధ ప్రాంతాల పొలాల్లోని శ్రీగంధం చెట్లను నరికి , ముక్కలుగా చేసి స్మగ్లింగ్ చేసే ముఠాను బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. మండలంలోని నల్లగుట్లపల్లె తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులు సుమారు 500 కిలోల శ్రీగంధం ముక్కలను స్మగ్లింగ్ చేసేందుకు సిద్ధం చేస్తుండగా సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నట్లు సమాచారం. నిందితులను, గంధం చెక్కలను స్వాధీనం చేసుకుని సమగ్ర విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలి

– కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో స్కానింగ్ సెంటర్లపై డెకాయి ఆపరేషన్లు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై సమీక్ష నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం–1994 (పీసీపీఎన్‌డీటీ) అమలును జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ప్రతి 1000 మంది మగ శిశువులకు 954 మంది ఆడ శిశువులు ఉన్నారన్నారు. ఆడ పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.


భ్రూణ హత్యలకు పాల్పడితే చర్యలు

చట్టవిరుద్ధమైన కార్యకలాపాలైన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు, న్యాయపరమైన శిక్షలు అమలు చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, పోలీసు, విజిలెన్స్ శాఖలు నిఘా పెట్టాలన్నారు.

డెకాయి ఆపరేషన్లు చేపట్టండి....

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డెకాయి ఆపరేషన్లు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా డీఎంఅండ్‌హెచ్‌ఓ వద్ద అనుమతులు పొందాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, డీఈఓ వరలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్



నాక్ అధికారులు గ్రేడ్ వెల్లడిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఎంతో ప్రాచుర్యం కలిగిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ 'ఏ' (స్కోర్ 3.13) గ్రేడ్ లభించింది. ఈ మేరకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గురువారం గ్రేడ్‌ను ప్రకటిస్తూ కళాశాలకు ఉత్తర్వులు పంపింది. పీవీకేఎన్ కళాశాలకు గతం కంటే ప్రస్తుతం న్యాక్ గ్రేడ్ మెరుగుపడింది. ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి, అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థుల కృషితో కళాశాలను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఆ కళాశాలలో ఆర్థిక నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రస్తుతం న్యాక్ ఏ గ్రేడ్ లభించింది.

పకడ్బందీగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖలోని పలు పోస్టులకు పకడ్బందీగా ముఖాముఖి నిర్వహించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ సమావేశ మందిరంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ ఇంటర్వ్యూలు చేపట్టారు. ఐసీడీఎస్ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకంలోని కౌన్సిలర్, ఔట్ రీచ్ వర్కర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న పలువురు అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అభ్యర్థుల నైపుణ్యాలను ట్రైనీ కలెక్టర్ ప్రశ్నల రూపంలో ఇంటర్వ్యూ చేశారు. మెరిట్ ఆధారంగా ఎంపికలు ఉంటాయని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి వెల్లడించారు.

అయ్యోర్ల జాబితా

- టీచర్ల సీనియారిటీ జాబితాపై కొనసాగుతున్న కసరత్తు
- ఎర్రర్‌తో డేటా తొలగిపోయి మొదటికొచ్చిన పనులు
- నెల రోజులుగా నిర్వహిస్తున్నా పూర్తిగాని ప్రక్రియ
- బదులు పర్యవేక్షణ పట్టని వైనం



చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సీనియారిటీ జాబితా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం అంత సులువు కాదు. ఈ కసరత్తు వేసవి సెలవుల్లో నిర్వహించుకోవాల్సింది పోయి..విద్యా సంవత్సరం చివర్లో కీలక సమయంలో నిర్వహిస్తున్నారు. దీంతో పదో తరగతి విద్యార్థుల పర్యవేక్షణ, పబ్లిక్ పరీక్షలకు కేంద్రాల ఏర్పాటు, టీచర్ల సమస్యలు అటకెక్కుతున్నాయి. టీడీపీ కూటమి అనాలోచిత నిర్ణయాలతో అటు టీచర్లు...ఇటు విద్యార్థులు అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. నెల రోజులుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రభుత్వ టీచర్ల సీనియారిటీ జాబితా కసరత్తు చేపడుతున్నా పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఇతర జిల్లాల్లో ఈ కసరత్తును పూర్తి చేసినప్పటికీ చిత్తూరు జిల్లాలో వెనుకబడి ఉన్నారు.



సీనియారిటీ జాబితా ప్రక్రియను అడిగి తెలుసుకుంటున్న ఆర్జేడీ బృందం

టీడీపీ కూటమి ఆర్భాటం కోసం..

వేసవి సెలవుల్లో బదిలీలు, ఉద్యోగోన్నతులు కలిప్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ రాష్ట్ర స్థాయిలో ప్రగల్భాలు పలికారు. క్షేత్రస్థాయిలోని సమస్యలు పట్టించుకోలేదు. ఆయన పబ్లిసిటీ కోసం విద్యాశాఖ సిబ్బందికి నిద్రలేని రాత్రులను గడిపేలా చేస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 4392 ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని కేడర్‌లలో 14,394 మంది టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వారు సర్వీసులో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు పూర్తి వివరాలను డీఎస్సీల వారీగా సేకరించాల్సి ఉంటుంది. అలా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇలా నమోదు చేసిన వివరాలను పలు దశల్లో పరిశీలిస్తున్నారు. అయినప్పటికీ పలు తప్పిదాలు దొర్లే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తున్నాయి.

విడుదలలో ఇంకెన్ని సమస్యలో...

ప్రస్తుతం విద్యాశాఖ అధికారులు చేపడుతున్న సీనియార్టీ జాబితా ఆన్‌లైన్ నమోదు కసరత్తు నేటితో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. అయితే గురువారం సర్వర్ మొరాయించడంతో కసరత్తు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఈ కసరత్తును ఆర్జేడీ శాఖ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం, కార్యాలయ ఏడీ విజయకుమార్, సూపరింటెండెంట్ బాబునాయక్‌తో పాటు డీఈఓ వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ ఏడీలు వెంకటేశ్వరరావు, రంగస్వామి పర్యవేక్షిస్తున్నారు. సీనియారిటీ జాబితా మొత్తం ఆన్‌లైన్ చేశాక జాబితాను విడుదల చేయనున్నారు. ఆ జాబితా విడుదల చేశాక ఇంకెన్ని సమస్యలు తలెత్తుతాయోనని ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రింబవళ్లు కుస్తీ...

టీచర్ల సీనియారిటీ జాబితాను ఆన్‌లైన్ చేసేందుకు డీఈఓ వరలక్ష్మితో పాటు విద్యాశాఖ సిబ్బంది రాత్రింబవళ్లు కుస్తీ పడుతున్నారు. మొదటి సారి ఎంతో కష్టపడి టీచర్ల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే ఆ వివరాల డేటా మొత్తం టెక్నికల్ ఎర్రర్ వల్ల తొలగిపోయింది. దీంతో మళ్లీ కసరత్తు మొదటికి వచ్చింది.చేసిన పనినే మరోమారు చేయాల్సి రావడంతో రాత్రిళ్లు నిద్ర మేల్కొని కసరత్తు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ కసరత్తుతో అటు అకడమిక్, ఇటు అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాలు జాప్యం అవుతున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు	: 4,392
స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు	: 8,435
విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లు	: 7,534
జిల్లాలో ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు	: 901
ఎస్జీటీ పోస్టులు మంజూరు	: 8,295
విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీలు	: 6,443
ఎస్జీటీ ఖాళీ పోస్టులు	: 1,852
పనిచేస్తున్న హెచ్‌ఎంలు	: 408